ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

ఆదివారం 1 డిసెంబరు 2024

## న్యూస్ బాక్స్

### మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు అందజేయాలి


జగిత్యాల అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెడుతున్న కార్మికులకు నెలనెలా వేతనాలు ఇవ్వాలని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు నునావత్ రాజు జిల్లా విద్యాధికారి రాముకు శనివారం వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్న భోజన వేతనాలతో పాటు కోడిగుడ్ల బిల్లులు ఇవ్వాలన్నారు. మధ్యాహ్న భోజన విషయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో జరుకుల గోవింద్, బానావత్ శేఖర్, రాజేందర్, మురళి పాల్గొన్నారు.

### క్షయ వ్యాధి నివారణపై అవగాహన కల్పించాలి

కోరుట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి నివారణకు గ్రామాలు, పట్టణాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్ వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో క్షయ వ్యాధి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తూ వైద్య సిబ్బందికి శిక్షణను అందించారు. కార్యక్రమంలో డీపీపీఎం కట్ట హరీష్, టీబీ సైపర్‌వైజర్ ఇమ్రాన్, అంజనేయులు, మల్లికార్జున్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాకు ఎస్‌డీఎఫ్ నిధులు

- పనులు ప్రతిపాదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- నిధుల ఆమోద బాధ్యత ఇన్‌చార్జి మంత్రికి
- ఒక్కో నియోజకవర్గానికి రూ. 10 కోట్ల చొప్పున కేటాయింపు





జగిత్యాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్) నిధులు రూ. 30 కోట్లు మంజూరయ్యాయి. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి రూ. 10 కోట్ల చొప్పున జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు రూ. 30 కోట్లు విడుదల చేస్తూ జీవో నంబర్ 299 జారీ చేసింది. ఈ నిధుల వినియోగానికి సంబంధించిన పూర్తి బాధ్యతలను ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి అప్పగించింది. ఈ నిధుల వినియోగానికి సంబంధించిన ప్రతిపాదనలను ఎమ్మెల్యేలు సంబంధిత అధికారుల ద్వారా జిల్లా ఇన్‌చార్జి మంత్రికి నివేదించాల్సి ఉంటుంది. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు వాటిని వెచ్చించాలి. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి ఎమ్మెల్యేలు డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పనులను ప్రతిపాదించారు.

### ఒక్కో నియోజకవర్గానికి రూ. 10 కోట్లు..

ఒక్కొక్క నియోజకవర్గానికి రూ. 10 కోట్లు చొప్పున నిధులను కేటాయించింది. జిల్లాలో జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో విపక్ష పార్టీకి చెందిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతి నిత్యం వహిస్తుండగా, ధర్మపురి నియోజక వర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే ప్రాతినిత్యం వహిస్తున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేతో పాటు విపక్ష పార్టీ ఎమ్మెల్యేలు సైతం తమతమ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులను చేపట్టేందుకు వీలుగా ప్రభుత్వం నిధులను విడుదల చేసింది.

### విద్యారంగానికి ప్రాధాన్యం

ఎస్‌డీఎఫ్ నిధుల వినియోగంలో ప్రభుత్వం విద్యారంగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చింది. ఒక్కో నియోజకవర్గానికి కేటాయించిన రూ. 10 కోట్లలో రూ. 2 కోట్లను ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఖర్చు చేయనుంది. వీటితో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రహరీల నిర్మాణం, మూత్రశాలల మరమ్మతు, అదనపు తరగతి గదుల నిర్మాణం, ఇంకా ఇతర పనులు ఉంటే వాటికి ఖర్చు పెట్టనున్నారు.

మరో కోటి రూపాయలను అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు వెచ్చిస్తోంది. మరో రూ. 50 లక్షలను కలెక్టర్, జిల్లా అధికారుల ప్రతిపాదనల మేరకు ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ కోసం వినియోగించడానికి యోచిస్తున్నారు. పాఠశాలలు, తాగునీరు, కార్యాలయాల నిర్వహణకు సంబంధించి 3.5 కోట్ల రూపాయలు పోగా మిగిలిన 6.5 కోట్ల రూపాయలను తమ నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులకు ప్రజా ప్రతినిధులు వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఈ నిధులతో చేపట్టిన పనులు పారదర్శకంగా జరిగేలా ప్రత్యేక తనిఖీలు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది.

మిగతా 8వ పేజీలో

## ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**- ఎస్పీ అశోక్‌కుమార్**



క్యూఆర్‌కోడ్ స్టికర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని ఎస్పీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మై ఆటో ఈజ్ సేఫ్ అనే కార్యక్రమాన్ని ఎస్పీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రయాణికుల సురక్షిత భద్రత కోసం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మై ఆటో ఈజ్ సేఫ్ అనే కార్యక్రమాన్ని చేపట్టి 1,500 ఆటోలకు వెనుక, ముందు వైపు క్యూఆర్‌కోడ్ స్టికర్లను కేటాయించామన్నారు. ఈ కార్యక్రమాన్ని రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా అమలు చేయనున్నట్లు వివరించారు. ప్రయాణికులు ఎవరైనా ఆటోలో ప్రయాణించే ముందు మొదటగా ఆటోలకు స్టిక్కరింగ్స్ ఉన్నాయా అని గమనించాలన్నారు. ఆటో డ్రైవర్ అసభ్యకరంగా ప్రవర్తించినా, దురుసుగా మాట్లాడిన క్యూర్‌కోడ్‌ను ఫోన్‌తో స్కాన్ చేస్తే డ్రైవర్ వివరాలు అగుపిస్తాయన్నారు. దీంతో పాటు ఎమర్జెన్సీ కంప్లైంట్ ఆప్షన్ వస్తుందని దీని ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు లైవ్ లోకేషన్ వెళుతుందన్నారు. ప్రయాణికులను ఆటోలో సురక్షితంగా ప్రయాణిస్తున్నారనే నమ్మకం కలిగించేలా ఆటో డ్రైవర్లు నడుచుకోవాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను అనుమతిస్తే చర్యలు తప్పవన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడితే జైలు శిక్ష తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రఘు చందర్, ఆర్టీవో శ్రీనివాస్, టౌన్ సీఐ వేణు గోపాల్, రూరల్ సీఐ కృష్ణారెడ్డి ఉన్నారు.

### జిల్లాకు 50 మంది కానిస్టేబుళ్లు

జగిత్యాల క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పోలీస్‌శాఖ ద్వారా జగిత్యాల జిల్లాకు 50 మంది పోలీస్ కానిస్టేబుళ్లను కేటాయించింది. జిల్లాకు చేరుకున్న కానిస్టేబుళ్లకు వివిధ పోలీస్‌స్టేషన్లలో పోస్టింగ్ ఇస్తూ ఎస్పీ అశోక్ కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అంకితభావంతో పనిచేసి జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకరావాలని సూచించారు.

### మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి

కోరుట్ల రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ణయించిన మెను ప్రకారం మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించాలని తహసిల్దార్ కిషన్ అన్నారు. శనివారం పట్టణంలోని మండల ప్రజపరిషత్ కార్యాలయంలో వివిధ పాఠశాల, గురుకుల, కస్తూరీ బా పాఠశాలల ప్రదానోపాధ్యాయులతో ఎంపీడీఓ రామకృష్ణ, మండల విద్యాధికరా నరేశం కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. పాఠశాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చూసి నీటి నిల్వలు ఉండ కుండా చూసుకోవాలని సూచించారు. త్రాగునీరు ట్యాంకులను ఎప్పడికప్పుడు శుభ్రం చేసి ఉంచాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీవో కృపాకర్, మండల నోడల్ అధికారి రాజేంద్రప్రసాద్, కాంప్లెక్స్ ప్రదానోపాద్యాయులు ఆనంద్ రావు, కృష్ణమోహన్, నల్ల భూమయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**మల్యాల(ఆంధ్రజ్యోతి):** మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్నబోజనంను అధికారులు పరిశీలించారు. మల్యాలలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఎంపీడీవో స్వాతి, ఎంఈవో జయసింహరావు పరిశీలించగా పలు పాఠశాలల్లో తహసీల్దార్ మునీంధర్, ఎంపీవో ప్రవీన్, ఏపీఎం రాజయ్య పాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

## జగిత్యాల పట్టణాభివృద్ధికి రూ. 100 కోట్లు

మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి

8

## ధర్మపురిలో ఘనంగా గోదావరి మహా హారతి



నృత్యం చేస్తున్న బాలికలు

7

# జిల్లాలో పెరుగుతున్న ఎయిడ్స్ కేసులు

**నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం**



ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది(ఫైల్)

జగిత్యాల అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని వణికించిన ఎయిడ్స్ మహమ్మారి తర్వాత క్రమంలో తగ్గుముఖం పట్టినప్పటికీ జనాలకు మాత్రం ఎయిడ్స్ అంటే భయం మాత్రం పోలేదు. జగిత్యాల జిల్లాలో గత సంవత్సరంతో పోల్చితే ఎయిడ్స్ కేసులు ఈ సంవత్సరం పెరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో గత సంత్సరం 3,400 ఎయిడ్స్ కేసులుండగా ఈసారి అవి 3,800 పెరిగినట్టు ఏఆర్‌టీ అధికారులు తెలిపారు.

ఎయిడ్స్ కేసుల పెరుగుదలలో ఉమ్మడి జిల్లాతో పోల్చితే జగిత్యాల జిల్లాలో ఎక్కువ కేసులు పెరిగినట్టు ప్రస్తుతం ఉన్న కేసులను బట్టి తెలుస్తున్నది. కొన్ని సంవత్సరాల క్రితం ఎయిడ్స్ మహమ్మారిపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించే వారు. దీంతో గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లో ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండేది. అందువల్ల జనాలు చాలా సంవత్సరాల పాటు ఎయిడ్స్ అంటే భయపడేవారు. అయితే ఇప్పటికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఎయిడ్స్‌పై ప్రచారం నిర్వహిస్తున్న ప్పటికీ అది పూర్తిస్థాయిలో జరగడం లేదని భావిస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా వ్యభిచార గృహాల వల్ల ఎయిడ్స్ వ్యాప్తి ఎక్కువగా జరుగుతున్నట్టు తెలుస్తున్నది. ఎయిడ్స్ రోగులకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందిసున్నది. ఎయిడ్స్ భారిన పడినవారు ఆరోగ్యంగా ఉండడానికి ప్రతి నెలా ఏడువేల రూపాయల విలువైన మందులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నది.

### రోగుల వివరాలు గోప్యంగా ఉంచుతాము

**- డాక్టర్ శ్రావణి ఏఆర్‌టీ ఇన్‌చార్జి, జగిత్యాల**

ఆసుపత్రికి వచ్చే ఎయిడ్స్ రోగుల వివరాలను గోప్యంగా ఉంచుతాము. అలాగే వారి పెన్షన్ దరఖాస్తు కూడా గోప్యంగా ఉంచుతాము. ఎయిడ్స్ సోకిన వారు జిల్లా కేంద్రంలోని ఏఆర్‌టీ సెంటర్‌లో తమ పేరు నమోదు చేసుకున్న తర్వాత కోరుట్ల, మెట్‌పల్లిలలో ఉన్న ఏఆర్‌టీ సబ్ సెంటర్లలో మందులు తీసుకోవచ్చు. రోగులు ప్రతీ ఆరు నెలలకోసారి పరీక్షలకు జగిత్యాలకు రావాల్సి ఉంటుంది.

# అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను తరలించాలి

**- ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి**





విద్యార్థులకు బోధిస్తున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, పాఠశాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి

జగిత్యాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దరూర్ క్యాంపులో గల అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను వసతులు ఉన్న ఇతర చోటికి తరలించాలని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని దరూర్ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాల తరగతి గదులు, కిటికీలు, బాత్ రూమ్‌లు పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సేవలు, మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. వంటశాలను సందర్శించి బియ్యం, పప్పు, ఇతర వంట సరుకుల నాణ్యతను పరిశీలించారు. నిత్యం పెట్టే మెనూలో వడ్డించే ఆహార పదార్థాలను ఆరా తీశారు. పాఠశాలలో కనీస వసతులు, మూత్రశాలలు, బాత్ రూమ్‌లు, కిచెన్‌లు లేకపోవడం, తరగతి గదులు సైతం సరిపోయే విధంగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలుసుకున్నారు. గోపాలరావుపేటలోని ప్రభుత్వ పాఠశాల భవనంలోకి గాని, గతంలో ఎస్పీ కార్యాలయ భవనంలోకి గాని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌ను తరలించే అంశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్‌కు పంపిన లేఖలో కోరారు.

### ఉపాధ్యాయుడిగా మారిన ఎమ్మెల్సీ..

జగిత్యాలకు చెందిన ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి శనివారం పట్టణంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో కొద్ది సమయం ఉపాధ్యాయుడిగా మారారు. పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకోవడానికి సందర్శించిన సందర్భంగా తరగతి గదిలోకి వెళ్లి పాఠ్యపుస్తకం తీసుకొని విద్యార్థులతో మాటామంతి కలిపారు. విద్యార్థులకు వివిధ సబ్జెక్టులలో అందుతున్న బోధనను అడిగి తెలుసుకున్నారు. పలు అంశాల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని, పాఠశాలకు గైర్హాజరు కావద్దని సూచించారు.

### అదనపు కలెక్టర్ సందర్శన..

పట్టణంలోని దరూర్ క్యాంపులో గల అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి రాము శనివారం సందర్శించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు లేని కారణంగా పాఠశాలను ఇతర పాఠశాలకు తరలించడానికి అవసరమైన అంశాలను పరిశీలించారు. గోపాలరావుపేట జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల, ప్రాథమిక పాఠశాల భవనాలను సందర్శించి పరిశీలించారు. వీలైనంత తొందరలో దరూర్ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను గోపాలరావుపేటకు తరలించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని ఆదేశించారు. పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## గురుకులాల్లో విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కరువు

**- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్**



విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

రాయికల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కరువైందని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ అన్నారు. బీఆర్‌ఎస్ గురుకులాల బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని అల్లీపూర్ గ్రామంలోని బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల సందర్శన కోసం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించి, విద్యార్థుల వసతులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దావ వసంతసురేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో నాసిరకమైన భోజనాన్ని పిల్లలకు పెట్టడంతో వారు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని పేర్కొన్నారు. గురుకుల విద్యావ్యవస్థను రేవంత్ సర్కార్ నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బర్కం మల్లేష్, మండల మహిళా అధ్యక్షురాలు స్పందనసాగర్ రావు, ప్రధానకార్యదర్శి రత్నాకర్‌రావు, రాయికల్ పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### ఎయిడ్స్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కోరుట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాది సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సునిత అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వ్యాది సోకకుండా తీసుకవలసిన జాగత్తలకు సంబందించిన పోస్టర్‌ను వైద్య సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్బంగా డాక్టర్ సునిత మాట్లాడారు. వాడిన సిరంజీలు, తిరిగి వాడినా హెచ్‌ఐవీ పాజిటివ్ ఉన్న వారి బ్లడ్ ద్వారా ఇతరులకు సక్రమిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు వెంటనే గీజర్లను ఏర్పాటు చేయాలి

గొల్లపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చలితీవ్రత అధికంగా ఉన్న దృష్ట్యా జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు గీజర్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం గొల్లపల్లి మండల కేంద్రంలోని పెగడపల్లి మహాత్మా జ్యోతిబాపూలే సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయాన్ని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు కల్పిస్తున్న మౌలిక వసతులను పరిశీలించారు. కిచెన్ రూంలో నిత్యావసర సరకులను తనిఖీ చేశారు. తాగునీటి వసతులను, తరగతి గదులను, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం రికార్డులను, హాజరు పట్టికలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ చలికాలం దృష్ట్యా వసతి గృహంలో విద్యార్థినులకు స్నానాలకు వేడినీటిని అందించేందుకు యుద్ధప్రతిపాదికన గీజర్లను ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ సుష్మితను ఆదేశించారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా

**- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్**



లబ్దిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

బీర్‌పూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధే ధ్యే యంగా పని చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శనివారం బీర్‌పూర్ మండలంలోని కొల్వాయి గ్రామంలో కల్యాణలక్ష్మి, సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో 500లకే గ్యాస్ సిలిండర్, గృహాలకు ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇలా అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. బీర్‌పూర్ మండల కేంద్రంలో కోటి 40లక్షల నిధులతో ప్రైమరీ హెల్త్ సెంటర్ మంజూరు చేశామన్నారు. తుంగూర్ గ్రామంలో కస్తూర్బా పాఠశాల మంజూరు అయిందని త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. 134 కోట్ల రూపాయలతో రోళ్లవాగు పనులు జరుగుతున్నాయ ని కొన్ని సాంకేతిక కారణాలతో ప్రాజెక్టు ఆలస్యం అయ్యిందన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారులతో సమీక్ష చేశామని త్వరలోనే పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన ఏడు లక్షల 75వేల రూపాయల విలువగల చెక్కులను, 26 మంది ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి పథకం ద్వారా మంజూరైన 26లక్షల 3వేల రూపాయల విలువగల చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్‌రావు, తహసీల్దార్ ముంతాజుద్దీన్, ఎంపీడీవో లచ్చాలు, నాయకులు నారపాక రమేష్, నల్ల మహిపాల్ రెడ్డి, శీలం రమేష్ పాల్గొన్నారు.

### గల్ఫ్ బాధితులకు ఆర్థిక భరోసా

**జగిత్యాల అర్బన్(ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ బాధిత కుటుంబానికి ఇచ్చే ఐదు లక్షల రూపాయలు ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శనివారం జగిత్యాల మండలంలోని ఐదుగురు గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల చొప్పున ప్రొసీడింగ్ కాపీలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## బ్యాంకు అధికారుల వేధింపులు

**- ఇంటి నుంచి వెళ్లిపోయిన బాధితుడు**

ఎల్లారెడ్డిపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణం కోసం ఓ ప్రైవేటు బ్యాంకులో తీసుకున్న రుణాన్ని చెల్లించాలని బ్యాంకు అధికారులు వేధింపులు తట్టుకోలేక ఇంటి యజమాని మజీద్ ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన ఎల్లారెడ్డిపేటలో శనివారం జరిగింది. తన భర్త కనిపించడం లేదని భార్య సల్మా కన్నీళ్లు పెట్టుకుంది. ఆమె తెలిపిన మేరకు.. గ్రామంలోని మజీద్ ఇంటి నిర్మాణం కోసం ఐదేళ్ల కిందట సిరిసిల్ల పట్టణంలోని ఓ ప్రైవేటు బ్యాంకులో ఐదు లక్షల రుణం తీసుకున్నాడు. వాయిదా పద్ధతిలో చెల్లించేందుకు అంగీకరించాడు. ప్రతి నెల పద్ధతిలో డబ్బులు చెల్లిస్తున్నాడు. ఇటీవల మజీద్ అనారోగ్యానికి గురవడంతో నెల వారి డబ్బులు చెల్లించేందుకు ఆలస్యమైంది. దాంతో బ్యాంకు అధికారులు గడువు ముగిసిందని పేర్కొంటూ నిత్యం మజీద్ ఇంటికి చేరుకుని చెల్లించాలని ఒత్తిడి చేశారు. వారి వేధింపులు భరించలేని తన భర్త మజీద్ తమకు చెప్పపెట్టకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదని బాధితురాలు సల్మా పేర్కొంది. ఘటనపై స్థానిక ఎస్‌ఐ రమాకాంత్‌ను వివరణ కోరగా తమకెవరూ ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు.

## ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ

మానకొండూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లలితాపూర్ బస్టాండ్ వద్ద శనివారం ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టింది. కరీంనగర్ నుంచి జమ్మికుంట వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు, లారీ లలితాపూర్ బస్టాండ్ మూల మలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఎవరికీ ప్రమాదం జరుగలేదు.



ఓదెలలో సాగు చేస్తున్న డ్రాగన్ పండ్ల తోట



విక్రయానికి సిద్ధంగా ఉన్న డ్రాగన్ ఫ్రూట్స్

# పండ్ల తోటల సాగుపై ఆసక్తి

- డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్న సింగరేణి రిటైర్డ్ కార్మికుడు
- వరికంటే లాభదాయకం కావడంతో మరికొందరి దృష్టి

ఓదెల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఓదెల గ్రామానికి చెందిన చింతం లక్ష్మయ్య సింగరేణి కార్మికునిగా పనిచేసి ఉద్యోగ నాలుగేళ్ల క్రితం విరమణ పొందాడు. ఓదెల శివారులో తనకున్న ఎకరం భూమిలో డ్రాగన్ ఫ్రూట్ తోటను సాగు చేశాడు. రసాయనిక పద్ధతుల్లో కాకుండా సేంద్రియ పద్ధతిలో పండ్ల తోటను సాగు చేశాడు. మొదట రూ.5 లక్షల పెట్టుబడితో ప్రణాళికలు రూపొందించిన లక్ష్మయ్య సిద్దిపేట నుంచి ఒక్కోటి రూ.50 చొప్పున డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు తెప్పించి సాగు చేశాడు. పెట్టిన ఏడాది నుంచే దిగుబడి ప్రారంభమైందని, ఎకరానికి రూ.40 వేల వరకు లాభం వస్తుందని లక్ష్మయ్య పేర్కొన్నాడు. ఏటా జూన్ నుంచి డిసెంబరు వరకు పండ్లను కోసం సమీపంలోని వారసంతలకు తీసుకెళ్లి విక్రయిస్తుంటానని లక్ష్మయ్య తెలిపాడు. ఓదెలతో పాటు మరికొన్ని గ్రామాల్లో రైతులు డ్రాగన్ పండ్ల తోటను పెంచేందుకు సిద్ధమవుతున్నారు. వరి పంటకంటే అధిక లాభం వస్తుండడంతో పలువురు రైతులు పండ్ల తోటలవైపు దృష్టిని సారిస్తున్నారు.

**● ఇష్టంతో కష్టపడుతున్నా..**

**- చింతం లక్ష్మయ్య, రైతు, ఓదెల**



సింగరేణి కార్మికునిగా పనిచేసే విరమణ పొందిన తర్వాత కాలక్షేపం చేయలేదు. ముందు నుంచే వ్యవసాయం అంటే చాలా ఇష్టం. అందుకే ఇష్టంతో డ్రాగన్ పండ్ల తోటను పెంచేందుకు సిద్ధపడ్డాను. దీంతో అధిక లాభాలను పొందుతున్న పత్తి, వరి పంటలు సాగు చేసే బదులు పండ్ల తోటలను సాగు చేస్తే ఆర్థికంగా నష్టాలకు గురికారనే ఉద్దేశంతో డ్రాగన్ పండ్ల మొక్కలను తెప్పించి సాగుచేశాను. ఇతర పంటలకంటే రెండింతలుగా లాభాలు ఉంటున్నాయి. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా డ్రాగన్ మొక్కలను మిగతా రైతులకు అందజేస్తే గ్రామాల్లో మరికొందరు సాగు చేసే అవకాశాలున్నాయి.

## హాస్టల్ విద్యార్థులను పట్టించుకోని ప్రభుత్వం

**● మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

**● సైనిక్ స్కూల్ పరిశీలనకు వెళ్తుండగా అదుపులోకి తీసుకున్న పోలీసులు**

చొప్పదండి/రామడుగు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శనివారం చొప్పదండి మండలంలోని రుక్మాపూర్ సైనిక్‌స్కూల్ పరిశీలనకు వెళ్తున్న రవిశంకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురుకుల బాటలో భాగంగా ఆయన సైనిక్ స్కూలు సందర్శనకు వెళ్తున్న క్రమంలో రుక్మాపూర్‌లో పోలీసులు అడ్డుకొని అరెస్టు చేసి రామడుగు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సంద ర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో విద్యార్థులకు చేయూతని చ్చేందుకు పలు సంక్షేమ హాస్టళ్ల ప్రారంభించామని చెప్పారు. ప్రస్తుత ముఖ్యమంత్రి విద్యార్థులను పట్టించుకోవడం లేదన్నారు ఇప్పటికైనా సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



సుంకె రవిశంకర్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తంగళ్లపల్లి, నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం పద్మనగర్ గ్రామ శివారులోని శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పద్మనగర్‌కు చెందిన నాగిశెట్టి ప్రసాద్(36) ఉదయం వాకింగ్‌కు వెళ్లి సైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా వెనకు నుంచి గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆటోలో జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతునికి భార్య మీనాక్షి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రసాద్(ఫైల్)

## ఆత్మహత్యాయత్నం చేసిన ఇద్దరి మృతి

వీణవంక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన విద్యార్థి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేతిగల్ గ్రామానికి చెందిన వేముల సిద్దార్థ(21) హుజూరాబాద్ మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. రెండు నెలల నుంచి కళాశాలకు సరిగా వెళ్లడం లేదని తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపం చెంది ఈ నెల 27న పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు జమ్మికుంటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. తండ్రి వేముల రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

**పెద్దపల్లి మండలంలో..**

పెద్దపల్లి రూరల్: మండలంలోని పెద్దకల్వల గ్రామానికి చెందిన బత్తుల శంకరయ్య(52) చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బత్తుల శంకరయ్య మద్యానికి బానిసై ఈ నెల 28న తన పత్తిచేనులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు తెలుపగా పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య కొమురమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్‌ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు. శంకరయ్యకు కూతురు, కుమారుడు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

శంకరపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టులో చేపల కాపలాకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగట్టు గ్రామానికి చెందిన రెడ్డి శంకర్ (39) అనే వ్యక్తి ఈ నెల 23న కులవృత్తిలో భాగంగా అదే గ్రామానికి చెందిన ఎడ్ల మల్లయ్య, రేగుల రాజయ్యతో కలిసి రాత్రి చేపలు పట్టడానికి చెరువులో వేసిన వలలకు కాపలాగా వెళ్లారు. రాత్రి అక్కడ చెరువు వద్ద ఉన్నారు. తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లిన శంకర్ ప్రమాదవశాత్తు చెరువు కట్ట పక్కన కింద పడిపోయాడు. అతడి కేకలు వేయడంతో ఎడ్ల మల్లయ్య, రేగుల రాజయ్యలు అక్కడికి వెళ్లి చూడగా అతని తలకు గాయమైంది. శంకర్‌ను ఇంటికి తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. శంకర్ ప్రమాదవశాత్తు జారిపడడంతో తలకు గాయమై చికిత్స పొందుతూ మృతి చెందాడని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## గంభీరావుపేటలో దొంగతనం

గంభీరావుపేట నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలోని దేవరాజు, మైసిరెడ్డి ఇళ్లలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఇండ్లకు తాళాలు వేసి ఈ రెండు కుటుంబాలు వేరే గ్రామానికి వెళ్లారు. రెండు ఇండ్లలో దొంగలు తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. దేవరాజ్ ఇంట్లో 10 వేలు నగదు, అర తులం బంగారం, 38 తులాల వెండి దొంగలు అపహరించారు, మైసిరెడ్డి ఇంట్లో దొంగలు తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించినప్పటికీ ఆ ఇంట్లో ఏమీ చోరీకాలేదు. ఇదిలా ఉండగా దొంగలు తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనానికి పాల్పడుతుండడంతో ప్రజలు భయాందోళన గురవుతున్నారు.

## బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

జగిత్యాలరూరల్, నవంబరు 30( ఆంధ్రజ్యోతి) జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ శివారులో గల కమాన్ వద్ద ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన నలువాల భగత్(26) అనే యువకుడు మృతి చెందినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. భగత్ రాత్రి సమయంలో తన బైక్‌పై లక్ష్మీపూర్ నుంచి జగిత్యాలలోని గాంధీనగర్ లో గల తన అత్తగారింటికి బయల్దేరారు. లక్ష్మీపూర్ కమాన్ వద్ద భగత్ ప్రయానిస్తున్న బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో భగత్ తలకు బలమైన గాయాలై మృతిచెందినట్లు తెలిపారు.మృతుడి భార్య మధుమిత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నిరంజన్ (ఫైల్)

సుల్తానాబాద్, నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సుల్తానాబాద్‌లో జరిగింది. ఎలిగేడు మండలంలోని బురాహన్ మియాపేటకు చెందిన గౌరు నిరంజన్ (35) అనే యువకుడు తన భార్య పిల్లలను చూడడానికి అత్తగారి గ్రామమైన సుల్తానాబాద్ మండలంలోని గట్టేపల్లికి ద్విచక్ర వాహనం పైనుంచి వెళ్తుండగా సుల్తానాబాద్-గట్టేపల్లి రోడ్డులో ఉన్న రైల్వే వంతెన సమీపంలో శనివారం తెల్లవారుజామున బైక్ అదుపుతప్పి ప్రమాదంలో నిరంజన్ మరణించాడని పోలీసులు తెలిపారు. నిరంజన్ రోడ్డుపై పడిపోయి ఉండగా కొందరు గమనించి 108లో సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుని భార్య సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడు నిరంజన్ ఎలిగేడు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏగా పనిచేస్తాడని భార్య ఫిర్యాదులో పొర్కొంది.

# ఇంటర్నేషనల్ స్యాండ్ ఫెస్టివల్‌కు శంకర్ ఎంపిక

కరీంనగర్ కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఒరిస్సా రాష్ట్రంలో జనవరి 1 నుంచి 5వ తేదీ వరకు జరిగే ఇంటర్నేషనల్ సాండ్ ఫెస్టివల్‌కు పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కలగూడూరు గ్రామానికి చెందిన రేవెల్లి శంకర్ ఎంపికయ్యారు. కరీంనగర్ మంకమ్మతోటలో నివాసముంటున్న శంకర్ వివిధ దేశాల నుంచి హాజరయ్యే ప్రసిద్ధ సైకత శిల్పుల సరసన వుమెన్ పవర్, ఎకోటూరిజం, క్రీడలు, కల్చరల్, ఎన్విరాన్‌మెంట్ అంశాలపై సైకత శిల్పాలను రూపొందించనున్నారు. 2022, 2023 సంవత్సరాల్లో కూడా ఇంటర్నేషనల్ సాండ్ ఫెస్టివల్‌లో పాల్గొని సైకత శిల్పాలను రూపొందించి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందుకున్నారు. ఆగస్టు 15న మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా ప్రతిభా పురస్కారం అందుకున్నారు. కాగా ఇంటర్నేషనల్ సాండ్ ఫెస్టివల్‌కు ఎంపికైన రేవెల్లి శంకర్‌కు పలువురు అభినందిస్తున్నారు.



ఒరిస్సాలో సైకత శిల్పాలను రూపొందించిన శంకర్ (ఫైల్)

## హుజూరాబాద్‌లో రాష్ట్రస్థాయి హాకీ పోటీలు



హాకీ ఆడుతున్న క్రీడాకారులు

హుజూరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో అండర్-14 ఎస్‌జీఎఫ్ బాల బాలికల రాష్ట్రస్థాయి హాకీ పోటీలు శనివారం రెండో రోజూ కొనసాగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జయన్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గుడిపాటి జైపాల్‌రెడ్డి, సామాజిక కార్యకర్త వర్ధినేని రవీందర్‌రావు హాజరయ్యారు. క్రీడకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి పది జిల్లాలు రాష్ట్రస్థాయి హాకీ జట్లు పోటీపడ్డాయి. బాలికల విభాగంలో కరీంనగర్, నిజామాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల జట్లు సెమీఫైనల్‌కు చేరాయి. బాలుర విభాగంలో నిజామాబాద్, హైదరా బాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాల జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. కార్యక్రమంలో బీ శ్రీనివాస్, టి శ్రీనివాస్, మధు, పీఈటీలు రాజిరెడ్డి, వేణుగోపాల్, సారయ్య, వి రవికుమార్, భాగ్యలక్ష్మి, అనిల్, శ్రీనివాస్, రేణుక ఉన్నారు.

## మహిళలపై దాడులను అరికట్టాలి

**● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్**



సమావేశమైన ధర్మపురి నియోజకవర్గ ఐద్వా సభ్యులు

ధర్మపురి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహిళలపై దాడులను అరికట్టాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ అన్నారు. ధర్మపురి పట్టణంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నియోజక వర్గ సమావేశం లావణ్య అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాంత్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు భద్రత భరోసా లేకుండా పోయిందన్నారు. మహిళలు పోరాడి అనేక చట్టాలు సాధించుకున్నప్పటికీ వాటిని అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. హత్యలు, అత్యాచారాలు చేసిన వారిపై కఠిన చర్యలు వెంటనే తీసుకోకుండా ఏళ్ల తరబడి కేసులు పరిష్కారం కాకుండా రాజకీయ నాయకులు అండతో బాధితులకు న్యాయం జరగడం లేదని తెలిపారు. స్త్రీల హక్కుల కోసం ఐద్వా నిర్విరామ కృషి చేస్తూ మహిళా సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాటాలు చేస్తోందని ఆయన అన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ కమిటీ కన్వీనర్‌గా అద్దరి కవిత, కోకన్వీనర్లుగా లావణ్య, సరోజ, ఏడుగురు కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కో కన్వీనర్ కోమిటి చంద్రశేఖర్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి గర్వందుల రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల సురేష్ పాల్గొన్నారు.

# రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

**● డ్రగ్స్ పార్సల్, బ్యాంక్ రుణం, క్రెడిట్ కార్డు, ఉద్యోగాల పేరిట మెస్సేజ్‌లతో మోసాలు**

**● కమిషనరేట్‌లో 220 కేసులు, 15 మంది అరెస్టు ● 197 కేసుల్లో రూ. 1.09 కోట్లు రికవరీ**



కరీంనగర్ క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హాలో.... మీ పేరు పద్మనా.... ఎయిర్‌పోర్ట్ నుంచి కస్టమ్స్ అధికారిని మాట్లాడుతున్న... మీ పేరిట పార్సల్ వచ్చింది. అందులో డ్రగ్స్, నకిలీ పాస్‌పోర్ట్‌లున్నాయి. అంటూ ఇటీవల కరీంనగర్‌కు చెందిన ఒక మహిళకు గుర్తుతెలియన వ్యక్తి వాట్సప్ కాల్ చేశాడు. దీంతో ఆ మహిళ భయపడిపోయింది. దీనిని ఆసరగాగా తీసుకున్న సైబర్ నేరగాడు.. మీపై సైబర్ క్రైం నమోదవుతుందని చెప్పాడు. కాన్ఫరెన్స్ ద్వారా సైబర్ క్రైం పోలీసు అధికారిని మాట్లాడుతన్నాడంటూ మరో వ్యక్తి లైన్‌లోకి వచ్చాడు. మీపై సైబర్ క్రైం నమోదైంది. డిజిటల్ అరెస్టు చేస్తున్నాం.... కేసు నుంచి బయట పడాలంటే ఈ విషయం ఎవరికి చెప్పకుండా.. కొంత డబ్బులు మేము చెప్పిన బ్యాంక్ ఖాతాకు జమచేయాలి అని చెప్పాడు. భయపడిపోయిన ఆ మహిళ తన ఖాతా నుంచి రెండు విడతలుగా 21.66 లక్షల రూపాయలు ట్రాన్స్‌ఫర్ చేసింది. మరుసటి రోజు అనుమానం వచ్చిన బాధితురాలు కరీంనగర్ సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటికే ఆ అకౌంట్ నుంచి డబ్బులు అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ అయినట్లు సైబర్ క్రైం పోలీసులు గుర్తించారు.చివరకు ఆ అకౌంట్ యజమానిని అరెస్టు చేశారు.

● కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఉద్యోగికి ఒక రోజు వాట్సప్‌కాల్ వచ్చింది. ఆ వాట్సప్‌లో పోలీసు యూనిఫాం ధరించిన అధికారి ఫొటో ఉంది. ఆ వ్యక్తి మాట్లాడుతూ హైదరాబాద్‌లో మీ కూతురు వద్ద డ్రగ్స్ పట్టుకున్నాము. సైబర్ క్రైం నమోదైంది... డిజిటల్ అరెస్టు చేస్తాం అంటూ బెదిరించాడు. గంట ముందే ఆ ఉద్యోగి తన కూతురుతో మాట్లాడాడు. అటువంటిది ఏమీ లేదని, ఆ వాట్సప్‌కాల్ ఫేక్‌గా పసిగట్టి స్పందించకుండా కాల్ కట్ చేశాడు.

**● ఎన్నో రకాల మోసాలు**

ఈ విధంగా సైబర్ నేరగాళ్లు అనేక రకాలుగా డ్రగ్స్ పార్సల్, న్యూడ్ వీడియోకాల్స్, ఏపీకే ఫైల్స్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, షేర్ మార్కెట్, పిల్లలను అరెస్టు చేస్తున్నామంటూ కాల్స్ చేస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతూ కోట్లు కొల్లగొడుతున్నారు. ప్రస్తుత ఆధునిక యుగంలో శాస్త్ర, సాంకేతికంగా ఎంతో అభివృద్ధి సాధించినప్పటికీ అదే స్థాయిలో అదే సాంకేతికతో మోసాలు చేస్తున్న నేరగాళ్లు పెరుగుతున్నారు. సైబర్ మోసగాళ్లు మొదట్లో ఏటీఎం కార్డుల పిన్ నంబర్, ఓటీపీ, కార్డులను మార్చి, ఫ్రాడ్ మెస్సేజ్, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాల ద్వారా డబ్బులు కొట్టేసేవారు. ఇటీవల డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు చెలరేగిపోతున్నారు.

**● రూ. కోట్లు కోల్పోయిన బాధితులు**

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరగాళ్లబారినపడి కోట్ల రూపాయలు పోగొట్టుకున్నారు. బాధితుల ఫిర్యాదుల మేరకు ఇప్పటి వరకు కరీంనగర్ సైబర్ క్రైం పోలీసు ఠాణాలో 220 కేసులు నమోదు అయ్యాయి. ఇందులో 197 కేసుల్లో 15 మంది నిందితులను అరెస్టు చేశారు. 1.09 కోట్ల రూపాయలు సైబర్ క్రైం పోలీసులు రికవరీ చేశారు. సైబర్ నేరగాళ్ల ఫేక్ ఖాతా(మూల్ అకౌంట్) ద్వారానే బాధితుల నుంచి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసుకుంటూ చిక్కకుండా పోతున్నారు.

**● మూల్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్**

సైబర్ నేరగాళ్లు ముందుగా ఒక వ్యక్తి గుర్తింపు కార్డుతో ఒక బ్యాంక్ ఖాతాను తెరిపించి, ఆ వ్యక్తికి ఐదు వేల రూపాయలు ముట్టచెబుతున్నారు. తరువాత ఖాతా బుక్కు, ఏటీఎం కార్డు వెంట తీసుకువెళతారు. సైబర్ నేరాలకు తన ఖాతాను ఉపయోగిస్తున్న విషయం ఆ వ్యక్తికి తెలియదు. సైబర్ క్రైం నమోదైన తరువాత పోలీసులు విచారణ చేపట్టడంతో మొదట డబ్బులు ఏ ఖాతాకు బదిలీ అయ్యిందనే విషయాన్ని గుర్తిస్తారు. సాంకేతికపరంగా ఖాతా కలిగిన వ్యక్తిపైనే కేసు నమోదవుతుంది. ఇటువంటి అకౌంట్‌ను మూల్ అకౌంట్ అంటారు. సైబర్ నేరాలకు నేరస్థులు ఉపయోగించే బ్యాక్ ఖాతాలు మూల్ ఖాతాలే కారణమని సైబర్ క్రైం పోలీసులు చెబుతున్నారు. ఈ మూల్ ఖాతాల నుంచి డబ్బులను ఇతర సంస్థలకు బదిలీ చేసుకుంటున్నారు.

**● డిజిటల్ అరెస్ట్..**

వీడియో కాల్, స్కైప్, వాట్సప్ కాల్ ద్వారా అమాయకులకు సైబర్ నేరస్తులు కాల్ చేసి తాము కస్టమ్స్ అధికారులమని, నార్కోటిక్, పోలీసులు, సీబీఐ, ఈడీ, సైబర్‌క్రైం అధికారులమంటూ నకిలీ గుర్తింపు కార్డులు, నకిలీ అరెస్టు వారెంట్లు చూపెడుతూ నమ్మిస్తున్నారు. కేసుల పేరుతో భయపెట్టి డబ్బులు దండుకుంటున్నారు. పన్నుల ఎగవేత, డబ్బుల దుర్వినియోగం వంటి కారణాలను చూపెడుతూ అమాయకులను భయపెడుతున్నారు. సైబర్ నేరగాళ్లు పోలీసు అధికారులమని చెబుతూ నమ్మించేందుకు పోలీసు స్టేషన్లలా కనిపించే గదుల్లో కూర్చుని వీడియోలో కనిపించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. తాము విచారణలో సహకరిస్తామని, కేసులో పేరు లేకుండా చేస్తామని, కొంత డబ్బులు చెల్లించాలని నమ్మబలికి వారి బ్యాంకు ఖాతాలకు లేదా యూపీఐ ఐడీలకు డబ్బులను బదిలీ చేయించుకుంటారు.

**● అవగాహన పెంచుకోవాలి**

సైబర్ మోసాలపై ప్రజలు అవగాహ కలిగి పెంచుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. బ్యాంక్ ఖాతా, పిన్, ఆధార్, ఓటీపీ తదితర సమాచారాన్ని ఇతరులకు ఎట్టిపరిస్థితుల్లో చెప్పవద్దని వారంటున్నారు. నిజమైన పోలీసు, కస్టమ్స్, సీబీఐ, ఈడీ వంటి శాఖల ప్రభుత్వ అధికారులు డబ్బులు చెల్లించాలని, బ్యాంక్ ఖాతా వివరాలు అడగరనే విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని సూచిస్తున్నారు. డిజిటల్ అరెస్టు అనేది ఉండదని ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఓ ప్రకటన జారీ చేసింది. ప్రజలు ఈ విషయాలన్నీ గమనించాలని పోలీసులు సూచిస్తున్నారు.


## చిన్నారిని చిదిమేసిన నిర్లక్ష్య డ్రైవింగ్

సుల్తానాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు చిన్నారి తనువుచాలించింది. సుల్తానాబాద్ మండలంలోని కదంబాపూర్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం కాశెపల్లిలో శనివారం ఫరీదా - రాజ్ మహ్మద్ దంపతులు కూతురు ఏడాదిన్నర వయసు గల రఫీద తమ ఇంటి ఎదుట ఆడుకుంటోంది. ఈ ఇంటి ఎదురుగా ఉన్న షకీల్ అనే వ్యక్తి తన బొలెరో వాహనాన్ని స్టార్ట్ చేసి వెళ్లే క్రమంలో వాహనం వెనక వైపు ఉన్న ఏడాదిన్నర పాపను గమనించలేదు. దాంతో వాహనం పాపపై నుంచి వెళ్లడంతో పాప మృతి చెందింది. చిన్నారి తండ్రి రాజ్‌మహ్మద్ బతుకు తెరువు కోసం దుబాయ్ వెళ్లాడు. తల్లి ఫరీదా కన్నీరు మున్నీరవుతోంది. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీపాదకాలనీలో పోలీసుల కార్డన్ సెర్చ్

మంథని, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని శ్రీపాదకాలనీలో సీఐ రాజు, ఎస్‌ఐలు రమేష్, చంద్రకుమార్, నరేష్‌ల ఆధ్వర్యంలో పోలీసులు శనివారం పోలీసులు కార్డన్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనాలను గుర్తించి చాలన్ వేశారు. యువత మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని, ఇలాంటి సమాచారాన్ని పోలీసులకు ఇవ్వాలని సీఐ రాజు సూచించారు.

## రోలర్ స్కేటింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఇద్దరు చిన్నారులు జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యారు. కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లో ఈ నెల 5 నుంచి 10 తేదీ వరకు జరిగే 62 జాతీయస్థాయి సబ్ జూనియర్ రోలర్ స్కేటింగ్ పోటీలకు జిల్లాకు చెందిన పట్నాన శ్రీహన్సి, ఏ అమృత వర్షిణి ఎంపికయ్యారు. అక్టోబర్ 4 నుంచి 8వ తేదీ వరకు భువనగిరిలో జరిగిన రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల రోలర్ స్కేటింగ్ పోటీల్లో విశేష ప్రతిభ చాటిన శ్రీహన్సి 9-11 సంవత్సరాల వయస్సు విభాగంలో, అమృత వర్షిని 5-7 సంవత్సరాల వయస్సు విభాగంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని కోచ్ గట్టు అనిల్ కుమార్, అసిస్టెంట్ బి నరహరి తెలిపారు.

## హోటల్ గదిలో డబ్బులు మాయం

కరీంనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ వీపార్క్ హోటల్లో తనకు చెందిన 4.5 లక్షల రూపాయలు చోరీకి గురయ్యాయని రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన పూడూరు మల్లేశం శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు మల్లేశం 28న వీ పార్క్ హోటల్‌లో రూమ్ అద్దెకు తీసుకొని ఉన్నాడు. రూం నుంచి బయటకు వెళ్లి వచ్చేసరికి బ్యాగులోని 4.5 లక్షల రూపాయలు చోరీకి గురయ్యాయని కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కరీంనగర్ జోన్ ఈడీగా బాధ్యతలు చేపట్టిన ఖుస్రోషాఖాన్



భగత్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీగా ఖుస్రోషాఖాన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం రీజియన్ల డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. నూతన ఈడీ ఖుస్రోషాఖాన్‌ను డిప్యూటీ రీజినల్ మేనేజర్లు కె సత్యనారాయణ, ఎస్‌భూపతిరెడ్డి, డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ ఎ విలాస్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోచయ్యలింగం, పర్సనల్ ఆఫీసర్ ఎంచంద్రయ్య, ఈడీ కార్యదర్శి యుగంధర్‌రెడ్డి, కరీంనగర్-1, 2 డిపో మేనేజర్లు విజయమాధురి, వి మల్లయ్య, కరీంనగర్ బస్‌స్టేషన్ అసిస్టెంట్ మేనేజర్ సురేష్, లా ఆఫీసర్ రజనీకృష్ణ, బస్‌స్టేషన్ మేనేజర్ అంజయ్య స్వాగతం పలికారు. వరంగల్, ఖమ్మం రీజినల్ మేనేజర్లు విజయభాను, సరిరాం, జోనల్ వర్క్‌షాప్ మేనేజర్ సుగుణాకర్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జోన్ పరిధిలో స్థితిగతులపై ఈడీ ఖుస్రోషాఖాన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.


## ముగిసిన సీపీఎం మహాసభలు

భగత్‌నగర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో నిర్వమిస్తున్న సీపీఎం జిల్లా మహాసభలు శనివారం ముగిసాయి. ఈ సందర్భంగా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా మిల్కూరి వాసుదేవరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా గీట్ల ముకుందరెడ్డి, వర్ణ వెంకటరెడ్డి, గుడికందుల సత్యం, జి బీమా సాహేబ్, జిల్లా కమిటీ సభ్యులుగా యు శ్రీనివాస్, సంపత్, ఎడ్ల రమేష్, వెల్మారెడ్డి, రాజిరెడ్డి, శీలం అశోక్, డి నరేష్ పటేల్, జి రాజేశం, కోనేటి నాగమణి, కొప్పుల శంకర్, కో-అప్షన్స భ్యులుగా 15 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యదిర్శవర్గ సభ్యులు టి జ్యోతి, రాష్ట్ర కమిటీ సభ్యులు జె వెంకటేష్ తదితరులు తెలిపారు. ఎన్నికైన సభ్యులు పార్టీ పరిష్టతకు పాటుపడాలని కోరారు.

# ఆకట్టుకుంటున్న షాడో చిత్రాలు

## ఇంట్లోని వృథా వస్తువులతో ప్రదర్శన

- ఇల్లంతకుంట యువకుడి ప్రతిభ
- ఆర్ట్ విభాగంలో జాతీయ పురస్కారం



ఇంట్లోని వస్తువులతో వినాయకుడి చిత్రం



అమ్మవారి చిత్రం



పాలతో గీసిన సాయిబాబా చిత్రం



చెక్కెరతో గీసిన మదర్‌థెరిసా చిత్రం



పెన్నుతో గీసిన యువతి చిత్రం

ఇల్లంతకుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వృథా అనుకునే వస్తువులకు తన కళను జోడించి అబ్బురపరుస్తున్నాడు రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలకేంద్రానికి చెందిన సాన అనీల్‌కుమార్. చిన్ననాటి నుంచి సమాజంలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు ఉండాలనది అనిల్ అభిప్రాయం. అదే లక్ష్యం విభిన్న కళాకారుడిగా మార్చింది. తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో మొదట్లో పెన్సిల్, పెన్నులతో చిత్రాలు గీయడం ప్రారంభించాడు. అతడిని ప్రతిభను గుర్తించి పలువురు ప్రశంసించడంతో ఇంకా భిన్నంగా చేయాలని ప్రయత్నించాడు. ఇంట్లోని వస్తువులను ఒకదాని పక్కన మరొకటి చేర్చి వాటిపై వెలుతురు పడేలా చేసి షాడో (నీడ) చిత్రాలను ప్రదర్శించడం మొదలుపెట్టాడు. దీంతో సాన అనీల్ పేరు షాడో అనీల్‌గా మారింది. ఇంతేకాక పాలతో గాంధీ, చక్కెరతో మదర్‌థెరిసా, ఇసుకతో చెగువేరా చిత్రాలు వేశాడు. సుద్ద ముక్క, చీపురుపుల్లలతో పలు కళారూపాలు రూపొందించాడు. 2006లో చిత్రలేఖనం పోటీలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొదటి స్థానం, 2008లో క్రియేటివ్ పెయింటింగ్‌లో రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి, 2015లో ఉత్తమ యువపురస్కార్ అందుకున్నాడు. 2015లో లండన్‌లో జరిగిన ఫిల్మ్‌ఫెస్టివల్‌కు ఆన్‌లైన్ ద్వారా జరిగిన పోటీలలో 7వస్థానంలో నిలిచాడు. 2016లో అమెరికాలో జరిగిన ఆర్ట్ సెలక్షన్‌లో భాగంగా 200 డాలర్స్ ప్రైజ్‌మనీని సొంతం చేసుకున్నాడు. 2020లో విశాఖపట్టణంలో జరిగిన నార్త్‌ఢిల్లీ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ అవార్డు అందుకున్నాడు. అనీల్ రూపొందించిన షాడో ఆర్ట్‌కు ఢిల్లీలో రూ.లక్ష రెమ్యూనరేషన్ సొంతం చేసుకున్నాడు. పలువురి ప్రశంసలు అందుకుంటున్నాడు.

### ప్రత్యేక గుర్తింపు

**- సాన అనిల్‌కుమార్, ఇల్లంతకుంట**



విభిన్నమైన కళలతో ముందుకు పోతుండడంతో సమాజంలో ప్రత్యేకమైన గుర్తింపు లభిస్తోంది. చిన్ననాటి నుంచి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సాహం అందించారు. ఇప్పటి వరకు పెన్సిల్, పెన్నులతో 150 వరకు చిత్రాలు గీసాను. నాణేలతో వివేకానందుని చిత్రం, సుద్దముక్కలు, చీపురుపుల్లలతో వివిధ కళాకృతులు రూపొందించాను. అయితే షాడో చిత్రాలతో మంచి గుర్తింపు లభించింది. భవిష్యత్‌లో మరింత రాణించడానికి నిరంతరం ప్రయత్నిస్తున్నాను.

## నేడు పెద్దపల్లికి మంత్రి ఉత్తమ్ రాక

**- ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులు, సివిల్ సప్లయ్‌పై సమీక్ష**
**- సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన**

పెద్దపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి డిసెంబరు 1వ తేదీన పెద్దపల్లికి రానున్నారు. ఆయన మధ్యాహ్నం 12 గంటలకు తన నివాసం నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుని మధ్యాహ్నం 1:30 గంటలకు పెద్దపల్లికి రానున్నారు. 1:30 నుంచి 3 గంటల వరకు ఉమ్మడి జిల్లా పరిధిలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సంబంధిత అధికారులతో చేపట్టిన ప్రాజెక్టులు, చెక్ డ్యామ్‌ల పనులు, వాటి పరిస్థితి, కొత్తగా చేపట్టాల్సిన ప్రాజెక్టులు, రిజర్వాయర్లపై సమీక్ష చేయనున్నారు. అలాగే పౌర సరఫరాల శాఖ ద్వారా చేపట్టిన ధాన్యం కొనుగోళ్లు, డబ్బుల చెల్లింపు, రైతుల ఖాతాల్లో రూ.500 బోనస్ జమ, సీఎంఆర్, రేషన్ షాపుల నిర్వహణ, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు. నవంబరు 19న రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో నిర్వహించిన సీఎం సభలో కాళేశ్వరం ప్రాజెక్టు, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుల నిర్మాణాల్లో భాగంగా ఇప్పటి వరకు పెండింగులో ఉన్న పలు ప్యాకేజీల పనులు, రైతులకు పూర్తి స్థాయిలో సాగు నీటిని అందించేందుకు ఉమ్మడి జిల్లాలో చేపట్టాల్సిన పనుల గురించి వారం, పది రోజుల్లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించారు. ఆ మేరకు ఆదివారం సమావేశాన్ని పెద్దపల్లి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. సమీక్ష అయిన తర్వాత కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో 4వ తేదీన నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ ఏర్పాట్లను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యేలు నాయకులు పరిశీలించనున్నారు.

# పెద్దపల్లిలో సీఎం సభకు అధికారుల కసరత్తు

- రూ.378 కోట్ల పనులకు శంకుస్థాపన
- 9007 మంది గ్రూపు4, అసిస్టెంట్ సివిల్ సర్జన్, సింగరేణి ఉద్యోగులకు నియామక పత్రాల పంపిణీ
- అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా డిసెంబర్ 4న పెద్దపల్లిలో నిర్వహించనున్న యువత విజయోత్సవ సభకు అధికారుల కసరత్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లాలో 378 కోట్ల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. 9007 మంది గ్రూప్ 4, అసిస్టెంట్ సివిల్ సర్జన్, సింగరే ణిలో ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలను అందజేయనున్నారు. హైదరాబాద్‌లో చేపట్టే స్కిల్ యూనివర్శిటీలో భాగస్వామ్యం అయ్యే ఏడు ఏజెన్సీలతో ఒప్పంద పత్రాలపై సంతకం చేయనున్నారు. డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజ్‌తో పాటు సీఎం కప్‌ను ప్రారంభించనున్నారు. మరిన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసే అవకాశాలు ఉన్నాయి. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టరేట్‌లోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారని, ఇక్కడ నుంచి బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకునేందుకు ప్రొటోకాల్ ప్రకారం ముఖ్యమంత్రి కాన్వాయ్ సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలో రోడ్లు భవనాల శాఖ ద్వారా 266 కోట్లు, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా 66 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు, 10 కోట్లు వెహికల్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు, 26 కోట్ల నర్సింగ్ కళాశాల, 10 కోట్లు శాతవాహన కళాశాల అకాడమిక్ బ్లాక్ నిర్మాణ పనుల శంకుస్థాపన ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సీఎం సభాస్థలి వద్ద ఏర్పాటు చేసే స్టాళ్లను ఫైనల్ చేయాలని ఆర్డీఓకు సూచించారు. సీఎం వేదికపైకి చేరుకొని జ్యోతి ప్రజ్వలన చేస్తారని, రాష్ట్ర గేయం వస్తుందని తెలిపారు. సభలో రాష్ట్ర ముఖ్య కార్యదర్శి, మంత్రుల సందేశాలు ఉంటాయని, తర్వాత ఎంపిక చేసిన 10 మంది అభ్యర్థులకు సీఎం చేతుల మీదుగా నియామక పత్రాల పంపిణీ చేయనున్నారని, డిప్యూటీ సీఎం, ముఖ్యమంత్రి సందేశాలతో కార్యక్రమం ముగుస్తుందని అన్నారు. సభావేదిక పై ఉండే వీవీఐపీలు, వీఐపీలు, ఇతర నాయకులు, ఉన్నతాధికారుల జాబితా ముందుగానే తయారు చేసి పోలీస్ శాఖకు అందజేయాలని కలెక్టర్ తెలిపారు.

సభా వేదికపై ఉన్న ప్రతి కుర్చీలో ఎవరు కూర్చునేది స్పష్టంగా తెలియజేస్తూ ఏర్పాట్లు చేయాలని అన్నారు. సభా ప్రాంగణం వద్ద అవసరమైన బారికేడ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో రుణమాఫీ, బోనస్ వచ్చిన రైతులు, మహిళ సంఘాల సభ్యులు సీఎం సభకు వచ్చేలా సమీకరణ చేయాలన్నారు. వారికి భోజనం బస్సు వద్దనే అందించాలన్నారు. సీఎం కార్యక్రమానికి విధులు నిర్వహించే సిబ్బందికి గుర్తింపు కార్డులు అందజేయాలని కలెక్టర్ పరిపాలన అధికారికి సూచించారు. సీఎం సభకు వచ్చే ప్రజలు, అభ్యర్థులు, రైతులు వివిధ వర్గాల ప్రజలకు అవసరమైన తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# ఆకట్టుకున్న ఒగ్గు డోలు ప్రదర్శన

- ఒడిశాలో జాతీయ నృత్య ఉత్సవాల్లో తాడిజెర్రి కళాకారులు




ప్రదర్శన ఇస్తున్న తాడిజెర్రి ఒగ్గుడోలు కళాకారులు

గంగాధర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలో గంగాధర మండల తాడిజెర్రి ఒగ్గుడోలు కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంటుంది. ఒడిశాలోని భవాణి పాట్నా అంబేద్కర్ స్టేడియంలో భారత సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ 2024 గిరిజన జానపద సంప్రదాయ నృత్య మహోత్సవం నవంబరు 29 నుంచి డిసెంబరు 1 వరకు నిర్వహిస్తోంది. ఇందులో భాగాంగా గంగాధర మండలం తాడిజెర్రికి చెందిన మల్లికార్జున ఒగ్గు కళా సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలు కోలాటం, పురుషుల బృందం ఒగ్గుడోలు ప్రదర్శనకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

రెండు రోజులుగా తాడిజెర్రి కళాకారులు నిర్వహిస్తున్న ప్రదర్శనలను దేశం నలుమూలల నుంచి వచ్చిన అధికారులు, కళారులు ప్రసంశిస్తున్నట్లు బృంద నాయకుడు ఏగుర్ల మహిపాల్ తెలిపారు.

## అఖిల భారత బ్యాడ్మింటన్ పోటీల చాంపియన్‌గా సింధు



సింధు సాధించిన ట్రోఫీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత జోనల్ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల చాంపియన్‌గా జిల్లాకు చెందిన సింధు నిలిచింది. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఆలిండియా జోనల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సింధురెడ్డి సింగిల్స్, డబుల్ విభాగాల్లో విశేష ప్రతిభచాటి చాంపియన్‌షిప్‌ను సాధించింది. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో ఇటీవల నిర్వహించిన జోనల్ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లాలోని విద్యానగర్‌కు చెందిన సింధూరెడ్డి నాలుగేళ్ల సుదీర్ఘ విరాం తర్వాత సింగిల్స్, డబుల్ విభాగాల్లో చాంపియన్‌షిప్ సాధించింది. సింధూరెడ్డి శంషాబాద్‌లోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా సింధును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సన్మానించారు. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గంగాపత్ వెంకన్న, జిల్లా యువజన క్రీడాశాఖాధికారి శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు.

# ధర్మపురిలో వైభవంగా గోదావరి మహా హారతి

- కార్తీకమాసం చివరివారం ఆలయాల్లో భక్తుల రద్దీ



ధర్మపురి వద్ద గోదావరికి మహా హారతి ఇస్తున్న పీఠాధిపతి అతిథేశ్వరానంద , పొల్సాని



వేములవాడ రాజన్న ఆలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

ధర్మపురి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో గోదావరి మహా హారతి కార్యక్రమాన్ని శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. రాత్రి వేళలో అనేక మంది భక్తులు, మహిళలు, ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ కార్యకర్తలు వెంటరాగా విశ్వహిందూ మహా సంఘ్ భారత్, శ్రీలంక అద్వైత పీఠాధిపతి అతిథేశ్వరానంద పర్వత, గోదావరి మహా హారతి ఉత్సవ సమితి వ్యవస్థాపక చైర్మన్ పొల్సాని మురళీధర్‌రావు మొదట గోదావరి నదికి పూజలు నిర్వహించారు. అనంతరం వారు గోదావరికి మహాహారతి సమర్పించారు. మహిళలు, యువతులు, విద్యార్థినులు నదిలో దీపాలను వదిలారు. కార్యక్రమంలో గోదావరి హారతి రాష్ట్ర కన్వీనర్ లింగంపెల్లి వీర గోపాల్, కో కన్వీనర్లు దామెర రాంసుధాకర్‌రావు, బలుమూరి సంతోష్‌రావు, పాపారావు, హనుమాన్ సేవ సమితి అధ్యక్షుడు సాయిరెడ్డి, జగిత్యాల జిల్లా కన్వీనర్ పిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని విశ్వహిందూ మహా సంఘ్ భారత్, శ్రీలంక అద్వైత పీఠాధిపతి అతిథేశ్వరానంద పర్వత స్వామిజీ, గోదావరి మహా హారతి ఉత్సవ సమితి వ్యవస్థాపక చైర్మన్ పొల్సాని మురళీధర్ రావు దంపతులు వేర్వేరుగా సందర్శించారు.

- కార్తీకమాసం చివరివారం కావడంతో శనివారం ధర్మపురి క్షేత్రంలో శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గోదావరి నదిలో కార్తీక స్నానాలు ఆచరించారు. నవ దంపతులు గోదావరి పౌరోహితులచే సంకల్పాది పూజలు చేయించుకున్నారు. అనేక మంది మహిళలు నదిలో కార్తీక దీపాలు వదిలారు. భక్తులు ఆలయాలకు చేరుకుని అభిషేకాది పూజలు, కుంకుమార్చన, నరసింహ హోమం, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. ఆలయం ఆవరణలో గల ఉసిరిక చెట్టు చుట్టూ ప్రదక్షిలు చేసి కార్తీక దామోదరుడిని పూజించారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండదీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ధర్మపురి క్షేత్రంలో 29వ రోజు శనివారం గోదావరి హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

### రాజన్న ఆలయంలో..

వేములవాడ కల్చరల్: కార్తీక మాసం చివరివారం కావడంతో వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. భక్తులు శ్రీరాజరాజేశ్వర స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు. ఆలయంలోకి చేరుకున్న భక్తులు శ్రీపార్వతి పరమేశ్వరులను దర్శించుకుని తరించారు. కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలోని పార్కింగ్ స్థలంలో శ్రీకాళీ వారాహీ త్రిశక్తి పీఠం గురువు బ్రహ్మశ్రీ నవీన్‌శర్మ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు సంకెపల్లి సుధీర్‌రెడ్డి రాజన్న ఆలయానికి రావ డంతో అధికారులు స్వాగతం పలికారు. శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ రాజన్న దర్శనానికి వచ్చారు.

### కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిదానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా భక్తులు కొండపైకి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం బేతాళుడి వద్ద కూడా పూజలు చేశారు. ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, చంద్రశేఖర్ సిబ్బంది పర్యవేక్షించారు.

## 'మధ్యాహ్న భోజన విధులను ఉపాధ్యాయులకు ఇవ్వవద్దు'

సిరిసిల్ల రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన తయారీలో ఉపాధ్యాయులకు విధులను నిర్వహించకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో పాటు పెండింగ్ బిల్లులను చెల్లించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జీటీలకు ఓటు హక్కు కల్పించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం రాత్రి టీపీటీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ అధ్వర్యంలో టీపీటీఎఫ్ బాధ్యుల సమా వేశాన్ని నిర్వహించారు. ఈసమావేశానికి హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన మాదిరిగా విద్యాశాఖకు సంబంధించిన అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన విధులకు ఉపాధ్యాయు లను సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తున్నా మని అన్నారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బిల్లులు సరిగా మంజూరు చేయకుండా సరైన వసతులు కల్పిం చకుండా కేవలం ఉపాధ్యాయులను బాధ్యు లను చేస్తూ సస్పెండ్ చేయడం సరైన విధానం కాదన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శినన్నబోయిన తిరుపతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పాతూరి మహేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దుమాల రాంనాథ్‌రెడ్డి, విక్కుర్తి అంజయ్య, నాయకులు కిషన్‌రావు, పంజాల వెంకన్న, పురం వాసుదే వరావు, దబ్బెడ హన్మాండ్లు, నూగురి దేవేందర్, మందాడి శ్రీనివాసరెడ్డి, రజని రాణీ, తిరుపతి, మైలారం తిరుపతి, చకినాల రామచంద్రం, ఎడ్ల కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి

జగిత్యాలరూరల్, నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి): ఆలయాలు మసీదులు, చర్చిల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు సహకరించాలని జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి కోరారు. శనివారం జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ లో మసీదులు, ఆలయాలు, చర్చిల ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో జగిత్యాల రూరల్ ఎస్‌ఐ సధాకర్, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

**రాయికల్:** దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాల కట్టడిలో భాగంగా మండలంలోని వివిధ ఆలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని రాయికల్ ఎస్సై సుధీర్‌రావు సూచించారు. రాయికల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం దేవాలయాల కమిటీ సభ్యులతో ఎస్సై సమావేశం నిర్వహించారు. సీసీ కెమెరాల ఆవశ్యకత గురించి వివరించారు. ప్రతి ఆలయంలో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

## నేడు వ్యాసరచన పోటీలు

జగిత్యాలరూరల్, నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన ప్రజావిజయోత్సవాలను పురస్కరించుకొని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని జగిత్యాల మండల విద్యాధికారి భూమయ్య తెలిపారు. ప్రభుత్వ పాఠశాల పురాణిపేట, రూరల్ మండల ఎమ్మార్సీ ధరూర్‌క్యాంపు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోతరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు రేనోవేబుల్ ఎనర్జీ సోర్సెస్ అనే అంశంపై పోటీ నిర్వహిస్తామన్నారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి ఇద్దరికి తక్కువగా కాకుండా విద్యార్థులు పాల్గొనేలా కృషి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

**భీమారం(ఆంధ్రజ్యోతి):** విద్యార్థులకు మండల స్థాయిలో పునరుత్పాదక శక్తి వనరులు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం ఉంటుందని పేర్కొన్నారు.

**బుగ్గారం(ఆంధ్రజ్యోతి):** ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నేడు ఆదివారం బుగ్గారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు బాలబాలికలకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న 6 నుండి 10 వ తరగతి విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పునరుత్పాదక ఇంధన వనరులు అనే అంశంపై విద్యార్థులను వ్యాస రచన పోటీలకు సన్నద్ధులను చేసి పోటీలకు తీసుకరావాలని కోరారు.

# జగిత్యాల పట్టణాభివృద్ధికి రూ. 100 కోట్లు

### మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి

జగిత్యాల అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణ అభివృద్ధికి రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరగా అందుకు సానుకూలంగా స్పందించారని జగిత్యాల మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి సమగ్ర అభివృద్ధి నివేదిక(డీపీఆర్) పంపించమని ఆదేశాలు వచ్చాయన్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేశారు. జగిత్యాల మున్సిపల్ సర్వసభ్య సమావేశం చైర్మన్ జ్యోతి అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్స్, నూకపెల్లి డబుల్ బెడ్ రూం కాలనీల్లోని పాఠశాలలు, ఆస్పత్రి, వార్డు ఆఫీస్, పోలీస్ అవుట్ పోస్ట్, ఆలయం, మసీదు, చర్చి, శ్మశాన వాటిక, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపట్టడం కోసం రూ.100 కోట్లు అవసరమని గతంలో ముఖ్యమంత్రికి విన్నవించామన్నారు. అలాగే నూకపెల్లి అర్బన్ హౌజింగ్ కాలనీని మున్సిపాలిటీలో విలీనం చేయడానికి, నూతన మాస్టర్ ప్లాన్ మార్గదర్శకాల ప్రకారం, రైతుల భూములకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా నూతన మాస్టర్ ప్లాన్ తయారు చేయటానికి కౌన్సిల్ ఆమోదంతో ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో కమిషనర్ చిరంజీవి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



కోరుట్లలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

**● రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి**

**కోరుట్ల (ఆంధ్రజ్యోతి):** రాజకీయాలకు అతీతంగా పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య-అనిల్ అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య ఆధ్యక్షతన బల్దియా సాధారణ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 16 అంశాలతో కూడిన ఏజెండాను పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవ తీర్మానంతో ఆమోదం తెలిపారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలను సభ్యులు సభా దృష్టికి తీసుకపోగా సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య మాట్లాడారు. సభ్యుల సహకారంతో పట్టణం అన్ని రంగాల అభివృద్ధి జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ తిరుపతి, వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, డీఈఈ సురేష్, మేనేజర్ శ్రీనివాస్, టీపీఓ ప్రవీణ్ కుమార్, జేఏఓ శివకుమార్, ఏఈ అరుణ్ కుమార్‌లతో పాటు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

**● 'ప్రజాపాలన'ను విజయవంతం చేయాలి**

**రాయికల్ (ఆంధ్రజ్యోతి):** ప్రజాపాలన విజయోత్సవాలను ఆదివారం నుంచి ఈ నెల 9 వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని వీటిని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు సూచించారు. రాయికల్ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహించారు. పట్టణంలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో ప్రారంభించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల గురించి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. టీయూఎఫ్ఐడీసీ నిధులతో ప్రారంభించని పనుల స్థానంలో అత్యవసర పనులైన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టాలని తదితర 18 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, కౌన్సిలర్లు కన్నాక మహేందర్, మారంపెల్లి కుమార్, తురగ శ్రీధర్ రెడ్డి, వల్లకొండ మహేష్, అన్వరీ బేగం, కల్లెడ సునీత, మ్యాకల కాంతారావు, మ్యాకల అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాకు ఎస్‌డీఎఫ్ నిధులు

5వ పేజీ తరువాయి

### కొత్తగా చేపట్టే పనులకే...

జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాలతో పాటు కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని కొడిమ్యాల, మల్యాల మండలాలు, సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గం పరిధిలోని మేడిపల్లి, కథలాపూర్, భీమారం మండలాల్లో కొత్తగా చేపట్టబోయే పనులకు మాత్రమే ఎస్‌డీఎఫ్ నిధులను కేటాయించారు. ఈ నిధులతో చేపట్టే పనులు ఇంతకు ముందు ఏ పథకం కింద చేసి ఉండకూడదని స్పష్టం చేసింది. ఆయా ఎమ్మెల్యేల సమన్వయంతో పనులను ప్రతిపాదించి ముందుకు వెళ్లడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

### ఒక్కో నియోజకవర్గానికి రూ. 10 కోట్లు
**పూర్ణచందర్, జిల్లా ముఖ్యప్రణాళిక అధికారి**



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి రూ. 10 కోట్లు కేటాయిస్తూ ఎస్‌డీఎఫ్ నిధులు విడుదల చేసింది. ఈ మేరకు ఇటీవల ప్రభుత్వం జీవో జారీ చేసింది. ప్రభుత్వ మార్గ దర్శకాల మేరకు ఆయా నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు ప్రతిపాదించిన పనులు చేపట్టనున్నాము. జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల నియోజకవర్గాల కు నిధుల కేటాయింపు జరిగింది. నిధుల వినియోగం చేయడానికి అవసరమైన కసరత్తులు జరుగుతున్నాయి.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి: డీఈవో

జగిత్యాలరూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఈవో రాము సూచించారు. జగిత్యాల రూరల్ మండలంలోని కండ్లపల్లి మోడల్‌స్కూల్‌ను డీఈవో శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదులు పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించేలా చూడాలన్నారు. మెస్ వర్కర్లు, ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిసరాలను పరిశీలించి పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సరితాదేవి, సీనియర్ పీజీటీ నాగేష్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం

### - కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు



సమావేశంలో మాట్లాడుతున్న జువ్వాడి నర్సింగరావు

మెట్‌పల్లి టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గ అభివృద్ధి శూన్యమని, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఎమ్మెల్యే సంజయ్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. శనివారం పట్టణంలోని జువ్వాడి భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి అధిక నిధులు మంజూరు చేశారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సీడీపీ నిధులు 10 కోట్లు నిధులు మంజూర్ చేసినట్లు తెలిపారు. వీటితో పాటు ఎస్సీ సబ్ ప్లాన్ కింద ఎస్సీ కాలనీలలో సీసీ, డ్రైనేజీ నిర్మాణ పనులను నిధులు మంజూరయ్యాయని రెండు రోజుల్లో సంబంధిత పనులకు ప్రొసిడింగ్ కాపీలు అందజేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే సంజయ్ తప్పుడు ఆరోపణలు మానుకోని ప్రభుత్వానికి సహకరించాలని సూచించారు. ఎమ్మెల్యే పొద్దున ఒక మాట సాయంత్రం ఒక మాట మాట్లాడుతున్నారని ఆయన మంచి సైకాలజిస్ట్‌కు చూయించుకోవాలని హితవు పలికారు. అనంతరం 28 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు 10,19,500 లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తిప్పిరెడ్డి అంజిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పూదరి నర్సాగౌడ్, చెర్లపల్లి రాజేశ్వర్‌గౌడ్, జెట్టి లక్ష్మణ్, మార్గం గంగాధర్, రాంప్రసాద్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

### విద్యార్థులను ఆందోళనకు గురిచేయవద్దు..

**ఇబ్రహీంపట్నం(ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు సందర్శించారు. తరగతి గదులను, పాఠశాల పరిశుభ్రత, వంట గదులను పరిశీలించారు. వారితో కలిసి భోజనం చేశారు. భోజనం విషయంలో ప్రతిపక్ష నాయకులు విద్యార్థులను, తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేయవద్దని సూచించారు. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. అనంతరం అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు పోనకంటి చిన్న వెంకట్, కాశీరెడ్డి భాస్కర్‌రెడ్డి, కాస సంజీవ్, రాములు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపం బాధ్యత ప్రభుత్వాలదే

కోరుట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపం బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదని ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు అన్నారు. శనివారం పట్టణంలోని సి ప్రభాకర్ భవనంలో మధ్యాహ్న భోజన కార్మికులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలని ఎంఈవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు మాట్లాడారు. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే విద్యార్థుల మెస్ చార్జీలు రూ. 20 పెంచాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘ సభ్యులు పద్మక్క, సాయమ్మ, భాగ్య జమున, కొంతం రాజ, చంద్ర కళ, సఫియా బేగం, లక్ష్మి పాల్గొన్నారు.

## కళాశాలలో సౌకర్యాలు కల్పించాలి

కొడిమ్యాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సౌకర్యాలు మెరుగు పర్చాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించినట్లు ఆర్ఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అక్కపెల్లి రవీందర్ శనివారం తెలిపారు. ప్రహారీ గోడ నిర్మాణం చేయని కారణంగా పశువులు, పందులు చేరి విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉందన్నారు. నాణ్యలేని కారణంగా గదుల్లో ఫ్లోరింగ్ కుంగిపోవటంతో విద్యార్థులకు ఇబ్బందిగా ఉందన్నారు. కళాశాల మైదానంలో పిచ్చి మొక్కలు పెరగటం, వర్షం కురిసినప్పుడు బురదగా మారటంతో విద్యార్థులకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. కళాశాల అభివృద్ధితో పాటుగా మెరుగైన సౌకర్యాలు కలిగించడానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

## రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ముఖ్యమంత్రి కృషి

జగిత్యాల అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని న్యూహైస్కూల్ విద్యార్థి శ్రీజ, ధరూర్ క్యాంప్‌లోని కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థి ఎం రక్షిత స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా గోదావరిఖనిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైన సందర్భంగా ఎమ్మెల్యే వారిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో తెలంగాణ నుంచి ఒలింపిక్స్ పథకాలే లక్ష్యంగా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అనంతరం కోచ్ ఆరుముల్ల పవన్‌ను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో ఎంఏ ఆరిఫ్, శ్రీనివాస రావు, క్రాంతి పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీ ఉద్యోగిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

మెట్‌పల్లిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సారెస్పీలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగిపై శనివారం కోదాండ రామలయ కమిటీ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కోదాండ రామలయంలో క్యాషియర్‌గా పనిచేసిన టి శ్రీనివాస్, సీనియర్ అసిసెకటంట్, ఆలయ కమిటీ సభ్యుడిగా కొనసాగిన రిటైర్డ్ హెడ్ మజ్దూర్ ఆర్మూర్ పోచయ్యపై ఆలయ కమిటీ సభ్యులు పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ నిరంజన్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఆలయానికి సంబంధించిన లెక్కల్లో అవినీతికి పాల్పడి లెక్కలు అప్పజెప్పడం లేదని ఆరోపిస్తూ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అదే విధంగా ఎస్సారెస్పీ ఉన్నతధికారులకు కూడా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఫిర్యాదు చేసిన వారిలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు జెట్టి లింగం, పూదారి నర్సాగౌడ్, లక్ష్మయ్య, కమిటీ సభ్యులు ఉన్నారు.

## వృద్ధురాలిని తీసుకెళ్లిన కుమారులు

జగిత్యాల అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) కన్నతల్లిని శ్మశాన వాటికలో వదిలి వెళ్లిన కుమారులు జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు హరిఅశోక్ కుమార్, సఖి అడ్మిన్ లావణ్య చొరవతో వృద్ధురాలిని తమతో తీసుకెళ్లారు. శనివారం ఆర్డీవో మధుసూదన్ పోలీసుల సహకారంతో వృద్ధురాలి కుమారులను ఆర్డీవో కార్యాలయానికి పిలిపించారు. తల్లిని ఇలా వదిలి పెట్టడం సరి కాదని వృద్ధురాలి కుమారులకు సర్ది చెప్పారు. కుటుంబ పరిస్థితుల నేపథ్యలలో అలా చేయాల్సి వచ్చిందని, అందుకు పచ్చత్తాప పడుతున్నామని, మరోసారి అలా జరగదని ఆర్డీవోకు ఆమె కుమారులు రాత పూర్వకంగా తెలిపారు. అనంతరం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో సఖీ సంస్థ పర్యవేక్షణలో ఉన్న వృద్ధురాలిని కుమారులకు అప్పగించారు.



వృద్ధురాలిని కుమారులకు అప్పగిస్తున్న అధికారులు

## సమస్యను సానుకూలంగా పరిష్కరించుకోవాలి

మెట్‌పల్లి రూరల్, నవంబర్, 30 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని సమస్యను సానుకూలంగా పరిష్కరించుకోవాలని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామంలో నెలకొన్న భూ సమస్య పరిష్కారం కోసం మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌కు శనివారం గ్రామస్థులు తరలివచ్చారు. గ్రామానికి చెందిన సుంకేట గంగాధర్ అను వ్యక్తి గ్రామంలో 2007లో ప్రభుత్వ పాఠశాలను నిర్మించడానికి 36 గుంటల పట్టా భూమిని ఇచ్చాడు. దీంతో గ్రామంలోని ప్రభుత్వ భూమియైన 498 సర్వే నెంబర్‌లోని నాలుగు ఎకరాల భూమిని అప్పటి అధికార యంత్రంగం కేటాయించింది. రెవెన్యూ అధికారులు కేటాయించిన భూమికి సంబంధించిన హద్దులను గ్రామంలోని కొందరు తొలగించి భయబ్రాంతులకు గురి చేస్తున్నారని మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో సుంకేట గంగాధర్ ఫిర్యాదు చేశాడు. దీంతో వారిని పోలీసుస్టేషన్‌కు రావాలని పోలీసులు సమాచారం అందించారు. శనివారం మెట్లచిట్టాపూర్ గ్రామస్థులు తరలివచ్చారు. గ్రామంలో అధికారులు కేటాయించిన భూమి కంటే ఎక్కువగా సుంకేట గంగాధర్ సాగు చేస్తుండాని ఆరోపించారు. సమస్యను సానుకూలంగా పరిష్కరించుకోవాలని సముదయించి పంపించారు.



పోలీసు స్టేషన్‌కు తరలివచ్చిన మెట్లచిట్టాపూర్ గ్రామస్థులు

## 'మధ్యాహ్న భోజనం' పర్యవేక్షణ బాధ్యతల నుంచి తప్పించాలి

రాయికల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణ బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను పూర్తిగా తప్పించాలని స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్టీయూ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మండలంలోని పలు పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మచ్చ శంకర్, జిల్లా ప్రధానకార్యదర్శి భైరం హరికిరణ్ మాట్లాడుతూ తమిళనాడు తరహాలో ఉపాధ్యాయుల ప్రమేయం లేకుండా నిర్వహించే సెంట్రలైజ్డ్ కిచెన్ మాదిరిగా రాష్ట్రంలో కూడా మధ్యాహ్న భోజనాన్ని నిర్వహించాలని సూచించారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా నాణ్యతను కోరడంలో అర్థం లేదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మెనూకు బహిరంగ మార్కెట్ ధరలకు పొంతన లేకపోవడంతో నాణ్యత లోపిస్తోందన్నారు. ఉపాధ్యాయుల కమిటీలు కాకుండా, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు అలాగే తల్లిదండ్రుల కమిటీల ద్వారా పర్యవేక్షణ చేస్తే మధ్యాహ్న భోజన నాణ్యత మెరుగుపడే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పాలెపు శివరామకృష్ణ, రాయికల్ మండల శాఖ అధ్యక్షుడు విద్యామణి కృష్ణ, ఆడెపు రాజశేఖర్ పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే రిజిస్ట్రేషన్లు రద్దు



పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న సంక్షేమ శాఖ అధికారి జైపాల్‌రెడ్డి

కొడిమ్యాల, నవంబరు30(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తె ఆసుపత్రుల రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తామని జిల్లా మాతా శిశు సంక్షేమ అధికారి జైపాల్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులను అకస్మికంగా తనిఖీ చేశారు. కొడిమ్యాల పట్టణంలో ప్రభుత్వ నిబంధనలు ఉల్లఘించి నిర్వహిస్తున్న రెండు ఆసుపత్రులకు షోకాజ్ నోటీసులను జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించు కోవాలన్నారు. అంగడి బజారులోని మరో రెండు ఆసుపత్రులను తనిఖీ చేసి సెలైన్లు పెట్టవద్దన్నారు. ఆయన వెంట సీహెచ్‌వో రాజశేఖర్, సూపర్‌వైజర్ ఇందీవర్ శ్యాం ఉన్నారు.

● మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మాతా శిశు సంక్షేమ శాఖ అధికారి జైపాల్‌రెడ్డి అకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో నెల వారీగా జరిగే కాన్పుల వివరాల రికార్డును ఆయన తనిఖీ చేశారు. ప్రతి నెలా ఐదు సాధారణ కాన్పులు జరిగేలా చూడాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్ పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

# రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

కోరుట్ల రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతుల ప్రయోజనాల కొరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. శనివారం మండలంలోని అయిలాపూర్ రైతు వేదికలో రైతు పండగ సందర్భంగా సీఎం సందేశంను రైతులతో కలిసి మార్కెట్ కమిటి చైర్మెన్ పన్నాల అంజిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి నాగమణి, కాంగ్రెస్ నాయకులతో కలిసి విన్నారు. ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడారు. ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేసింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణగౌడ్, తిరుమల గంగాధర్, వెంకటేష్ గౌడ్, పుల్లూరి వెంకటేష్ గౌడ్, నక్కసుదీర్, బాపురెడ్డి, అమరేందర్, పల్లపు రాజు, జక్కుల రాజం, ఏలేటి మహిపాల్ రెడ్డి, శశీంధర్ రెడ్డి, సాయిరెడ్డి, కరిపెల్లి అజయ్ రెడ్డి పాల్గొన్నారు.

**మెట్‌పల్లి రూరల్:** మండలంలోని బండలింగాపూర్ గ్రామంలోని రైతువేదికలో రైతు సదస్సులో భాగంగా ప్రత్యేక టీవిని వ్యవసాయాధికారులు ఏర్పాటు చేయగా రైతులు, నాయకులు వీక్షించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, వ్యవసాయ సహాయకాధికారి రమేష్, మండల అధికారి దీపిక, ఏఈఒలు భూమేశ్వర్, నరేష్, రాజు, మనోజ్ఞ, సిబ్బంది, మమత, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

**కథలాపూర్:** మహబూబ్‌నగర్‌లో ప్రభుత్వం నిర్వహించిన రైతు పండగ కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రత్యక్ష ప్రసారం వీక్షించారు. కార్యక్రమంలో ఏఓ యోగిత, ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పులి శిరీషహరిప్రసాద్, డైరెక్టర్లు, రైతులు, ఏఈఓలు ఉన్నారు.

**మల్లాపూర్:** మండల కేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయ శాఖ జరిగిన కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహబూబ్ నగర్‌లో జిల్లాలో జరిగిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని రైతులు వీక్షించారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జలపతిరెడ్డి, ఏవో లావణ్య, ఏఈవోలు, ఏఎంసీ పాలక వర్గం, మాజీ జడ్పీటీసీ జలపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



మల్యాలలో సీఎం ప్రసంగం వింటున్న రైతులు,తి అధికారులు

**కొడిమ్యాల:** మండలంలోని పూడూర్ రైతువేదిక భవనంలో రైతు పండగ కార్యక్రమంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని మండలంలోని రైతులు వీక్షించారు. కార్యక్రమంలో ఏవో పి జ్యోతి, ఏఈవోలు, మాజీ సర్పంచు రాంరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ నాగభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

**మల్యాల:** ప్రజా విజయోత్సవాలలో భాగంగా మహబూబ్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన రైతు పండుగ కార్యక్రమంను మండల రైతులు వీక్షించారు. ఏవో చంద్రదీపక్, సింగిల్‌విండో చైర్మన్లు రాంలింగారెడ్డి, చంద్రశేఖర్ ఏఈవోలు పాల్గొన్నారు

**వెల్గటూర్:** వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో ఏఎంసీ పాలకవర్గంలో కలిసి రైతు పండగ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండాటి గోపిక జితేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ గోల్ల తిరుపతి, ఏఎంసీ సభ్యులు పోలోజు శ్రీనివాస్, లింగయ్య, మహిపాల్‌రెడ్డి, నాయకులు సందీప్ రెడ్డి, పూదరి రమేష్, గుమ్ముల వెంకటేష్ పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలి

గొల్లపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లన్నపేట రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 534లోని ప్రభుత్వ భూమిలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయించాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ వరందన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ శివారులో కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని కొన్నేళ్లుగా నివాసాలు ఏర్పర్చుకున్నారన్నారు. మరింత ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఓ వర్గం మందిర నిర్మాణానికి పూనుకున్నారని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జిల్లా గోరక్షక్ ప్రముఖ్ ఆడెపు నరేష్, విశ్వహిందూ పరిషత్ మండల శాఖ అధ్యక్షుడు కుంభార్‌కార్ అరుణ్, భజరంగ్ దళ్ మండల కన్వీనర్ ఎనగందుల రమేష్, మండల గోరక్ష ప్రముఖ్ జంగిలి సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

మెట్‌పల్లి రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గురుకులాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యే క శ్రద్ధ చూపుతోందని పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. శనివారం మండలంలోని మేడిపల్లి శివారులోని మెట్‌పల్లి మైనార్టీ గురుకుల పాఠశాలను ఆర్డీవో శ్రీనివాస్, ఎంఈవో చంద్రశేఖర్‌తో కలిసి సందర్శించారు. పాఠశాలలో తయారు చేసిన ఆహారం, వంట గదితో పాటు సరుకులను నిల్వ ఉంచిన గది, డైనింగ్ హాల్, పరిసరాలు, తరగతి గదులు, మరుగుదొడ్లు తదితర వసతులను పరిశీలించారు. డైనింగ్ హాల్లో భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడి అనంతరం వారితో కలిసి వారు భోజనం చేస్తూ వారి విద్యా విధానంలో ఎదురువుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి కావాల్సిన సలహాలు, సూచనలు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, జెట్టి లింగం, యమా రాజయ్య, ఎర్రోళ్ల హన్మాండ్లు, కొమిరెడ్డి లింగారెడ్డి, నర్సాగౌ డ్, జీవన్, గంగాధర్, రాజం, సత్యనారాయణ, ప్రిన్సి పాల్ తిరుపతి, నాయకులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో, కాంగ్రెస్ నాయకులు

## సంక్షిప్త సమాచారం

**కొడిమ్యాల:** మండలంలోని నల్లగొండ గ్రామ శివారులోని 239/ఏ సర్వే నంబరు ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎకరం ఏడు గుంటల భూమి సావనపెల్లి శ్రీనివాస్ తండ్రి నారాయణ నుంచి అప్పటి ప్రభుత్వం, అధికారులు భూసేకరణ చేసినట్లు కొడిమ్యాల ఆర్ఐ కరుణాకర్ శనివారం తెలిపారు. సాగు చేస్తున్నందున ఇది ప్రభుత్వ భూమి అని ఫ్లెక్సీ ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ తెలిపారు.

**ధర్మపురి:** మండలంలోని నేరెళ్ల గ్రామానికి చెందిన ఈదునూరి వేణుగోపాల్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆయన కుటుంబసభ్యులకు శనివారం టీపీసీసీ సభ్యుడు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్ 20 వేల రూపాయల ఆర్థికసాయం అందించారు.

**జగిత్యాల అర్బన్:** జగిత్యాల పట్టణానికి చెందిన బొద్దున జమున పీహెచ్‌డి పట్టాను అందుకున్నారు.గణితంలో పిహెచ్‌డి తీసిస్‌లో భాగంగా బయో కన్వెర్షన్ ఇన్ పోరస్ స్పేర్‌క్వావిటీ కంటైన్ గ్రయో టాపిక్ మైక్రో అర్గనైజం అండ్ నానో ఫ్లూయడ్ లేఅంశవలో పరిశోదనలను పూర్తి చేశారు. కేఎల్ యూనివర్సిటీ పూర్తి చేసిన తీసిస్‌తో శనివారం మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ నజీర్ చేతుల మీదుగా పట్టా అందుకనాన్నరు.

**మల్లాపూర్:** రైతులకు రుణమాఫీ చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరుతూ తహసీల్దార్ వీర్‌సింగ్‌కు శనివారం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో అందజేశారు.

రాయికల్: మండలంలోని సింగరావుపేట ఎస్సీ కాలనీలోని అంబేద్కర్ భవన్‌లో అధికారులు పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖయ్యూం, ఆర్ఐ దేవదాస్, పంచాయతీ కార్యదర్శి, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**వెల్గటూర్:** మండలంలోని తాళ్లకొత్తపేటలో మండల రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఆర్ఐ రాజేశ్వరి, అధికారులు పాల్గొన్నారు.